7

సాక్షి బాపట్ల

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



దుర్గమ్మ సేవలో దేవదాయ కమిషనర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకున్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.6,200, మోడల్ ధర రూ.5,000 వరకు పలికింది.

ఎనిమిది కరోనా కేసులు



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గురువారం ఎనిమిది కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. లాంలో మూడు, అంగలకుదురులో ఐదు కేసులు వచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
బాపట్ల	6:29	4:31
నరసరావుపేట	6:31	4:28
గుంటూరు	6:29	4:29

న్యూస్‌రీల్

24న చౌక్‌బాల్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చౌక్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికను ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్ చెప్పారు. పట్టణంలోని గ్రీన్‌వాలీ పాఠశాలలో మధ్యాహ్నం 2గంటలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9866419567 నంబరులో సంప్రదించాలన్నారు.

1,25,525 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,22,018 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,25,525 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్‌ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 87,727 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఖాళీ స్థానాల్లో ఎన్నికలకు సమాయత్తం



నరసరావుపేట రూరల్: జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ, కౌన్సిలర్ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతుంది. ఎన్నికల్లో వినియోగించేందుకు ఈవీఎంలను గురువారం శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లోని స్ట్రాంగ్ రూంకు తరలించారు. ప్రత్యేక భద్రత మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. తహసీల్దార్ రమణానాయక్, ఈవోపీఆర్డీ విజయకుమార్‌లు ఈవీఎం తరలింపును పర్యవేక్షించారు. వివిధ కారణాలతో జిల్లాలో ఐదు ఎంపీటీసీ, ఒక కౌన్సిలర్ స్థానం ఖాళీలు అయ్యాయి. ఆయా స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన 45 ఈవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

జూనియర్ సివిల్ జడ్జీల బదిలీ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిధిలో జూనియర్ సివిల్ జడ్జీలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తాడేపల్లిగూడెం 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సి.రమ్యను రాజమహేంద్రవరం 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో బాపట్ల పీజేసీజే ఇ.అన్నామణి రానున్నారు. పాలకొల్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.భానుసాయి ఒంగోలుకు బదిలీ అయ్యారు. చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జిగా మాచర్ల నుంచి పీజేసీజే సి.మధుబాబు రానున్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.00 అడుగుల వద్ద ఉంది. ఇది 156.6700 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎడమకాలువకు 4,949, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 12,137 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 12,137 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.60 అడుగుల వద్ద ఉంది.

అభాగ్యులపై వాత్సల్యం

అనాథ చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం వరం

- పాఠశాలల్లో విద్యను కొనసాగించే బాలలకు మాత్రమే ..
- వసతి గృహాలు, హోమ్స్‌లో ఉన్న వారికి పథకం వర్తించదు
- దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకు అవకాశం



మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు అందజేస్తున్న బాలిక తల్లి

చినగంజాం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకం అనాథ బాలలకు ఒక వరం. లక్షలాది మంది బాలలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. భారత ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా ఉన్న స్పాన్సర్‌షిప్ కార్యక్రమం ద్వారా నిరాదరణకు గురై అవసరత ఉన్న 18 ఏళ్ల లోపు చిన్నారులకు వారి విద్య, ఆరోగ్యం వారి అభివృద్ధి అవసరాలకు ఉపయోగ పడే విధంగా ఆర్థికంగా ఆదుకోవడానికి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులకు అనుబంధంగా షరతులతో కూడిన ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలో గతంలో ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు మాత్రమే ఆఖరు తేదీగా నిర్ణయించగా ప్రస్తుతం ఆ గడువు తేదీని ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. ఒక్క బాపట్ల జిల్లాలోనే ఇప్పటి వరకు 3004 దరఖాస్తులు అందినట్లు అధికారుల సమాచారం.

ఎవరు అర్హులు ?

అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు తల్లిదండ్రులు దూరమైన వారు, పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), కోవిడ్–19 కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి పీఎంకే పథకం కింద నమోదయిన వారు, విడాకులు పొందిన తల్లిదండ్రులున్నవారు, కుటుంబం వదిలేసిన తల్లిదండ్రులు, ప్రాణాంతక వ్యాధి బారిన పడినా, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయినా, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలలు, బాల కార్మికులు, అక్రమ రవాణాకు గురైన బాలలు ఇటువంటి వారికి కుటుంబ వాతావరణంలో పెరగటానికి నిర్దిష్ట పరిధిలో ఒక్కొక్కరికీ నెలకు రూ 4 వేలు చొప్పున మిషన్ వాత్సల్య పథకం ద్వారా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయటం జరుగుతుంది.

దరఖాస్తు చేసే విధానం..

అర్హులైన అభ్యర్థులు గ్రామ మహిళా కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్త, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతరుల ద్వారా గుర్తించి ఆ బాలల వివరాలు, కుటుంబ నేపథ్యం, ఆర్థిక, సామాజిక, ఆరోగ్య స్థితిగతులను, విద్య కొనసాగింపు వివరాలను తెలియపరుస్తూ ఉన్న దరఖాస్తు ఫారంను పూర్తి చేసి సంబంధిత ధ్రువ పత్రములను జత పరచి వారి పరిధిలోని ఐసీడీఎస్ సీడీపీఓకు దరఖాస్తు అందజేయవచ్చు.

దరఖాస్తుకు జతపరచ వలసిన పత్రాలు ...

- బాలుడు/బాలిక జనన ధ్రువీకరణ పత్రం
- బాలుడు/బాలిక ఆధార్ కార్డు
- తల్లి తండ్రుల ఆధార్ కార్డులు
- తల్లి/తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, మరణ కారణం
- గార్డియన్ ఆధార్ కార్డు
- రేషన్ కార్డు
- బాలుడు/బాలిక పాస్‌పోర్ట్ సైజు ఫొటో
- స్టడీ సర్టిఫికేట్(ప్రస్తుతం చదువుతున్న పాఠశాలలోనిది)
- ఆదాయ ధ్రువీకరణ పత్రం(రూరల్ అభ్యర్థులు రూ.72 వేలు/అర్బన్ అభ్యర్థులు రూ 96 వేలు లోపు ఆదాయం ఉండాలి)
- బ్యాంక్ అకౌంట్ వివరాలు(బాలుడు/బాలిక వ్యక్తిగత అకౌంట్ లేక తల్లి/తండ్రి/ సంరక్షకులతో జాయింట్ అకౌంట్)

దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక విధానం

సీడీపీఓ కార్యాలయానికి అందిన దరఖాస్తులను మండల స్థాయి స్క్రూటినీ కమిటీ సమావేశంలో ఉంచి, నిశితంగా పరిశీలించి అర్హత కలిగిన వాటిని ఎంపిక చేస్తారు. అనంతరం ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు సంతకాలు చేసిన తరువాత, సమావేశంలోని మినిట్స్‌తో పాటు దరఖాస్తులను జిల్లాలోని బాలల పరిరక్షణ విభాగం కార్యాలయానికి అందజేస్తారు.

మిషన్ వాత్సల్య పథకం గొప్ప వరం..



అనాథ బాలలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంచి పథకం మిషన్ వాత్సల్య. రాష్ట్రంలో ఎక్కువ మంది బాలలకు పథకం ద్వారా ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. 18 సం.లు లోపు చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం అందించిన ప్రాయోజిత కార్యక్రమం ఇది. రాష్ట్రంలో పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో దరఖాస్తు గడువును సైతం ఏప్రిల్ 30 వరకు పెంచడం జరిగింది.

– బత్తులు పద్మావతి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు

దొంగలపై పూర్తిస్థాయిలో నిఘా

- వేసవి నేపథ్యంలో లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌పై అవగాహన కల్పించాలి
- రాత్రిళ్లు గస్తీతిరిగే సిబ్బంది అనుమానితుల వేలిముద్రలు సేకరించాలి
- ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని, దొంగలపై నిఘా పెంచాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి కారణంగా రాత్రిళ్లు చాలామంది ఆరుబయట నిద్రించడం, ఇంటి తలుపులు తెరచి ఆదమరచి నిద్రించడం జరుగుతోందన్నారు. ఇదే అవకాశంగా తీసుకొని దొంగలు ఇళ్లల్లోకి చొరబడి చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి రాత్రిళ్లు ఇంటి తలుపులు తెరిచి నిద్రించరాదని హెచ్చరించారు. ముఖ్యంగా ఇళ్లలోని విలువైన వస్తువులు, నగదును బీరువాల్లోనే దాచుకునే అవకాశం ఉన్న కారణంగా బీరువా తాళాలు వేసుకోవాలని సూచించారు. ప్రజలు ఎవరైనా విహారయాత్రలకు, తీర్థయాత్రలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందజేయాలని, ఆ ఇంట్లో లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) కెమెరాలను ఉచితంగా అమర్చుతారన్నారు. ఇంట్లో ఎలాంటి అనుమానాస్పద కదలికలు ఉన్నా వెంటనే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరా ద్వారా కమాండ్ కంట్రోల్‌లో సైరన్ మోగుతుందని, తద్వారా పోలీసులు ఆ ఇంటికి చేరుకుని దొంగలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకునే వీలు కలుగుతుందన్నారు. అంతే కాకుండా పోలీసులు ఆ ఇంటిపై నిరంతర నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుందన్నారు. సచివాలయ మహిళా పోలీసుల ద్వారా ప్రతిరోజు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తాళం వేసి ఉన్న గృహాల సమాచారాన్ని సేకరించుకొని, రాత్రి గస్తీ తిరిగే సిబ్బందికి సమాచారం అందజేయాలన్నారు. రాత్రిపూట గస్తీ తిరిగే సిబ్బంది పోలీస్ సైరన్ వేసుకుంటూ తిరగాలని, అనుమానంగా ఉన్న ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా విచారించి ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా వారి వేలి ముద్రలు సేకరించాలన్నారు. తద్వారా నేరస్తులను సులువుగా గుర్తించవచ్చునని, అప్పుడే దొంగతనాలను నివారించగలుగుతామని ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు.

ఈవీ చార్జింగ్ స్టేషన్ ప్రారంభం



విజయవాడ భవానీపురంలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్‌కాస్ట్) రీజనల్ సైన్స్ సెంటర్‌లో న్యూ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్‌ను గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. సోలార్ పారాబోలిక్ కుక్కర్‌ను మంత్రి తదితర ప్రజాప్రతినిధులు పరిశీలిస్తున్న చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇద్దరు దుర్మరణం

ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఘటన



నుజ్జునుజ్జయిన రవాణా వాహనం

దాచేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. దాచేపల్లి సమీపంలోని భవ్య పెట్రోల్ సమీపంలో జరిగిన ఈ ఘటనలో రవాణా వాహనం డ్రైవర్ సీతవు చౌడయ్య(23), వాహనంలో ఉన్న బత్తుల ముక్కంటి(27) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురజాల మండలం తేలుకుట్లకు చెందిన బత్తుల ముక్కంటి తన బంధువులకు చెందిన రవాణా వాహనం వ్యవహారాలను చూస్తుంటాడు. ఈ వాహనానికి చౌడయ్య డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తేలుకుంట్లలో బంధువులకు చెందిన మిర్చిని వాహనంలో ఎక్కించి, గుంటూరులో దించి ఇద్దరు తేలుకుంట్లకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంకు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో డ్రైవర్ చౌడయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ముక్కంటిని గుంటూరు తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. సంఘటన స్థలాన్ని సీఐ షేక్ బిలాలుద్దీన్, ఎస్ఐ సంధ్యారాణి పరిశీలించారు. చౌడయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బిలాలుద్దీన్ వెల్లడించారు. మృతులిద్దరూ అవివాహితులే.

భక్తిశ్రద్ధలతో బాజీబాబా ఉరుసు మహోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



చాందిని అలంకారంలో గ్రామోత్సవానికి బయలుదేరిన బాబావారి గుర్రం



ప్రత్యేక ప్రార్థనల్లో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే కిలారి రోశయ్య

పెదకాకాని: బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం కనుల పండుగగా ప్రారంభమైంది. పెదకాకాని సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 535వ ఉరుసు మహోత్సవం పురస్కరించుకొని రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గురువారం తెల్లవారు జామున ప్రత్యేక ప్రార్థనలతో ఉరుసు మహోత్సవం ప్రారంభమైంది. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆదం షఫీ, దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషాలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు షఫా బావి నీటితో స్నానాలు చేసి దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం 5 గంటలకు బాజీబాబా గుర్రం దర్గాలో ప్రదక్షిణలు చేసింది. పెదకాకాని పొలిమేర సెంటర్ నుంచి ప్రత్యేక చాందిని అలంకరణలో గంథం బిందెలతో ప్రారంభమైన బాజీబాబా వారి గుర్రం శుక్రవారం తెల్లవారు జాము వరకూ వెనిగండ్ల గ్రామ పురవీధులలో తిరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం, తాగునీరు, టెంట్లను నిర్వాహకులు ఏర్పాటు చేశా రు. బాబావారి గుర్రం శుక్రవారం సాయంత్రం దర్గాకు చేరుకుంటుందని అనంతరం భక్తులకు గంథం పంచిపెట్టడం, సలామి ప్రార్థనలతో ఉరుసు మహోత్సవం ముగుస్తుందని ఈఓ షేక్ ముక్తార్ బాషా తెలియజేశారు.

ప్రత్యేక ప్రార్థనల్లో ...

బాజీబాబా ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ లు దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసిప్రార్థనల్లో పాల్గొన్నారు.

సహృదయమే సంపద

“ఆకలితో ఉన్న పొరుగువాడిని పట్టించుకోకుండా తన కడుపునింపుకొనే వాడు నిజమైన ముస్లిం కానేరడని మహమ్మద్ ప్రవక్త (సఅసం) సెలవిచ్చారు.'' ఇస్లాం అంటే తమను తాము అల్లాహ్‌కు అర్పించుకోవడమే. సర్వమానవాళి పరిపూర్ణ జీవన విధానాన్ని ఇస్లాం బోధిస్తుంది. ఇస్లాం ధర్మంలోని ఐదు ముఖ్య విధుల్లో జకాత్ ఒకటి. సమాజంలో ఆర్థిక సమానత్వం ఉండాలన్నదే దీని ముఖ్యోద్దేశం. ప్రపంచంలో క్యాపిటలిజం..కమ్యూనిజం పేరుతో దేశాల మధ్య పోరాటం జరుగుతున్న తరుణంలో ఇస్లాం సూచించిన ‘జకాత్’ సర్వమానవ సమానత్వ సాధనకు ఖచ్చితమైన సమాధానం కాగలదు. – గుంటూరు డెస్క్

ఇదే జకాత్ పరమార్థం

- రంజాన్‌మాసంలో జకాత్ చెల్లింపు తప్పనిసరి
- ఇస్లాం ప్రాథమిక ఐదు సూత్రాల్లో ఒకటి
- ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకే ఈ ధర్మం
- సామాజిక బాధ్యతగా జకాత్ చెల్లింపు ప్రతి ముస్లిం విధి



జకాత్ అంటే ఇస్లాం విధించే ఆర్థిక పన్ను అని భావిస్తుంటారు. అయితే ఇది సత్యదూరం. జకాత్‌కు ప్రాతిపదిక ఆదాయం మాత్రమే కాదు. ఆదాయంతో పాటు వ్యక్తి తాలూకా మొత్తం సంపద. అలా అని జకాత్ అంటే కేవలం సంపద పన్ను అనుకోవడం సరికాదు. సంపద కలిగిన ముస్లింల లో ప్రతి ఒక్కరూ తమ అవసరాలు పోగా మిగిలిన దానిలో నుంచి కనీసం 2.5శాతం తప్పనిసరిగా సమాజంతో పంచుకొని తీరాలి. జకాత్ పంపిణీ లక్ష్యం నిరుపేదలు, నిస్సహాయుల కనీస అవసరాలను తీర్చడం, పేదరికాన్ని నిర్మూలించడం.


కులమతాల భేదం లేదు...

జకాత్ రూపంలోని నగదు ఎవరికి ఇవ్వాలో ఇస్లాం నిర్దేశించింది. జకాత్ తీసుకునే అర్హతకు ప్రామాణికం పేదరికమే. ఇందులో కుల, మత వ్యత్యాసాలు లేవు. దగ్గర బంధువులలో ఎవరైనా పేదరికంలో మగ్గుతున్నా, అప్పుల్లో కూరుకుపోయి కష్టాలు అనుభవిస్తున్నా.. వారికి జకాత్ ఇవ్వవచ్చు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కుటుంబ యజమాని మరణించి, సంపాదించలేని పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వితంతువులూ అర్హులే. అలాంటి వారి కనీస అవసరాలు తీర్చడం, విద్య, వైద్య ఖర్చులకు జకాత్ నగదు ఇవ్వవచ్చు. కటిక పేదరికం అనుభవిస్తూ కూడా ఇతరుల ఎదుట సాయం కోసం చేతులు చాచలేనివారు, పస్తులున్నా దానికి బయటపెట్టని వారిని గుర్తించి, వారి వద్దకు వెళ్లి వినయంతో జకాత్ సొమ్ము ఇవ్వాలి. ధార్మిక విద్యను విస్తృతం చేసేందుకు సైతం జకాత్ సొమ్మును వినియోగించవచ్చు.

దుర్గుణాలు తొలగించే అస్త్రం...

ఇస్లాంలో పొందుపరిచిన ప్రాథమిక సూత్రమైనప్పటికీ జకాత్ అనేది సర్వమానవాళి శ్రేయస్సుకు రూపొందించబడింది. కేవలం ముస్లింలు మాత్రమే ఇవ్వాలని లేదు. మానవతా దృక్పథం కల్గిన ప్రతి సంపన్న వ్యక్తి జకాత్ సూత్రాన్ని పాటించవచ్చు. మనిషిలోని స్వార్థం, పిసినారితనం వంటి దుర్గుణాలు తొలగించే గొప్ప అస్త్రం జకాత్. అది ఆత్మపరిశుభ్రతకు, సంపద శుద్ధీకరణకు ఉపకరించే ఓ సాధనంగా దోహదపడుతుంది. జకాత్ మాటకు అసలైన అర్థం అభివృద్ధి, వికాసం. జకాత్ చెల్లింపులతో ఏదో ఒక స్థాయిలో అదనంగా ధనం వినియోగంలోకి వస్తుంది. నాటి వరకు నిశ్చలస్థితిలో ఉన్న ధనం ఉత్పత్తిరంగంలోకి వెళ్లి తిరిగి చలనాన్ని అందుకుంటుంది. తద్వార ఆర్థిక వ్యవస్థ సరికొత్త జీవాన్ని పోసుకుంటుంది.

ఆత్మ పరిశుభ్రత.. సంపద శుద్ధి



అహిలే ఖిద్మత్ ఇ షేరియా గ్రంథం ప్రకారం.. తమవద్ద 60.755 మిల్లీగ్రాముల బంగారం, 425.285 మి.గ్రా. వెండి కలిగిన ప్రతి సాహెబ్ నిసాబ్‌పై జకాత్ తీయం విధి. జకాత్ తీసుకునే మొదటి హక్కు పేదరికంలో ఉన్న బంధువులకుకాగా, రెండోహక్కు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న ఇరుగుపొరుగు కుటుంబాలు. అవసరాలకు మించిన ధనంపై 2.5శాతం చొప్పున జకాత్ ఇవ్వడం సంపదను శుద్ధి చేస్తుంది. ఆర్థిక సమానత్వం సిద్ధిస్తుంది. జకాత్ సొమ్ము చెల్లించిన వారి సంపద పెరుగుతుంది తప్ప తగ్గిపోదు. అల్లాహ్ దయవల్ల అంతా మంచే జరుగుతుంది. ప్రతి ఒక్కరూ జకాత్ సొమ్ము చెల్లిస్తే ప్రపంచం నుంచి పేదరికమే మాయమవుతుంది.

– ముఫ్తీ మహమ్మద్ అబ్దుల్ కలీమ్ సాహెబ్, ప్రభుత్వ ఖాజీ

సామాజిక బాధ్యత..

జకాత్ ఎంతో భిన్నమైనది. అది దాన ధర్మాల కిందకు రాదు. పుణ్యంకోసం తపనపడే వారు వివిధ రూపాల్లో దానధర్మాలు చేస్తారు. అది వ్యక్తి ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉంటుంది. కాని జకాత్ నగదు నిరుపేదలకు ఇస్లాం దఖలు పరిచిన హక్కు. సామాజిక న్యాయ సాధన కోసం ఇస్లాం విధించిన ఒక బాధ్యత. జకాత్ సంపన్న వ్యక్తులు తప్పని సరిగా పాటించవలసిన ఒక కర్తవ్యం. ఇస్లాం ధార్మిక నిర్మాణంలో జకాత్ ఒక మూల స్తంభం. ఇస్లాం ఆశించిన సాంఘిక, ఆర్థిక సమానత్వానికి అది ఆధారం. సంక్షేమ రాజ్య నిర్మాణానికి జకాత్ పునాది వంటిది. రంజాన్ మాసంలో ఏ మంచి కార్యం చేసినా పుణ్య ఫలం రెట్టింపులో ఉంటుంది. అందుకే అధికశాతం మంది ముస్లింలు రంజాన్ నెలలో జకాత్ చెల్లిస్తుంటారు.

క్లుప్తంగా

పరారీలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నరసరావుపేట టౌన్‌: దళిత యువతిని దగా చేసిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాకమూరి మారుతి అజ్ఞాతంలోకి జారుకున్నాడు. తనను మోసం చేసి పెళ్లి చేసుకుని బిడ్డ పుట్టాక ఇంటి నుంచి గెంటివేశాడు అంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు బుధవారం మారుతిపై కేసు నమోదు చేసిన విషయం విదితమే. తనకు, తన బిడ్డకు న్యాయం చేయాలంటూ బాధితురాలు గురువారం దళిత సంఘాల ప్రతినిధులతో టూటౌన్‌కు వచ్చి పోలీసులకు విన్నవించింది. నిందితుడు తన ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేసి పరారీ అయ్యాడు. పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసరావుపేట: నరసరావుపేట న్యాయవాదుల అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించనున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధానకార్యదర్శి పదవులకు న్యాయవాదులు పోటీ పడుతున్నారు. అధ్యక్ష పదవికి గాలి జయప్రకాష్, మేదరమెట్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి నసీమా బేగం, అమూల్య, ప్రధానకార్యదర్శి పదవికి ఎస్.ప్రసాదు, ఏ.ఏడుకొండలు పోటీలో ఉన్నారు. కోశాధికారి, సంయుక్త కార్యదర్శి పదవులకు ఒక్కొక్కరే నామినేషన్ వేయటంతో వారిద్దరూ ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ ప్రకటించనుంది. పోలింగ్ ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుంది. అనంతరం లెక్కింపు నిర్వహించి ఫలితాన్ని ప్రకటిస్తారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిటీ అధ్యక్షులు ఎస్.అయ్యపరాజు, సభ్యులు కట్టా నారపరెడ్డి, సీజే ప్రతాప్, అలెగ్జాండర్‌సుధాకర్ ఏర్పాట్లు చేశారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రవీణ్‌కుమార్ ప్రతిభ


ప్రవీణ్ కుమార్‌ను అభినందిస్తున్న ఉమ్మడి ప్రకాశం జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల రూరల్‌: సౌత్ ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో ప్రవీణ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించాడు. పోటీలు ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించారు. చీరాల రూరల్ బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్ కుమార్ 96 కిలోల విభాగంలో పాల్గొన్నాడు. ప్రత్యర్థులను వెనక్కునెట్టి ద్వితీయ స్థానం సాధించి నిర్వాహకుల చేతులు మీదుగా సిల్వర్ మెడల్‌తో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు. అంతేకాకుండా హైదరాబాద్‌లో మే 27, 28 తేదీల్లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఈయన బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ మరోవైపు తన లక్ష్యంపై దృష్టిసారించి సాధన చేస్తున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్రవీణ్ కుమార్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ డాక్టర్ పున్నారావు, రిటైర్డు డీఎస్‌డీవో శ్రీనివాస ప్రసాద్‌లతో పాటు పలువురు క్రీడా ప్రేమికులు ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు. పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ఆర్పీలపై చర్యలు తీసుకుంటాం

- ఏడు గ్రూపుల నుంచి రూ.8లక్షల రికవరీ
- మెప్మా పీడీ వెంకట నారాయణ


రికార్డులు పరిశీలిస్తున్న మెప్మా పీడీ వెంకట నారాయణ

రేపల్లె రూరల్‌: నకిలీ గ్రూపులతో బ్యాంకుల నుంచి రుణాలు పొందిన ఆర్పీల నుంచి నగదును రికవరీ చేస్తామని బాపట్ల మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట నారాయణ అన్నారు. ఇటీవల మెప్మాలో పలువురు ఆర్పీలు నకిలీ గ్రూపులతో బ్యాంకులను మోసగించి రుణాలు పొందిన ఘటన పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో గురువారం విచారణ నిమిత్తం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో ఆయన తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్పీల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రేపల్లెలో 11 గ్రూపులతో పలువురు ఆర్పీలు రూ.36.54లక్షలను రుణాలను పొంది దుర్వినియోగం చేశారని గ్రహించామన్నారు. ఇప్పటికే 7 గ్రూపుల నుంచి రూ.8లక్షలు రికవరీ చేసి సంబంధిత బ్యాంకులకు జమ చేశామన్నారు. ఇంకా 4 గ్రూపుల నుంచి రూ.28లక్షలు రికవరీ చేయాల్సి ఉందని చెప్పారు. 4 గ్రూపులకు సంబంధించిన ఆర్పీలకు వారంలో నగదు జమ చేయాలని ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. నగదు రకవరి తరువాత సంబంధిత ఆర్పీలకు శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు చేసే సమయంలో బ్యాంకు మేనేజర్‌లు క్షుణ్ణంగా దరఖాస్తులు పరిశీలించాలన్నారు. ఆయా గ్రూపు సభ్యుల వివరాలు, ఆధార్ అప్‌డేట్‌లు మెప్మా వెబ్‌సైట్‌లో పరిశీలించి రుణాలు మంజూరు చేశాయని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ విజయసారథి తదితరులున్నారు.

ముస్లింలకు ఘనంగా ఇఫ్తార్ విందు

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన పీఆర్కే, పీవీఆర్


ఇఫ్తార్ విందును ప్రారంభించి ముస్లింలకు వందనం చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: పట్టణంలోని 13 మసీదులలో పవిత్రమాసమైన రంజాన్ పండుగ పురస్కరించుకొని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల రీజనల్ యువజన విభాగ కన్వీనర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఆయా మసీదులలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తూర్పుబావి ప్రాంతంలోని నూర్ మసీదు, రహమానియా, మర్కస్ మసీదు, హుస్సేనియా మసీదు, బిలాల్ మసీదు, పీడబ్ల్యూడీ కాలని మసీదు, మక్కా మసీదుతో పాటు మరో మసీదులలో వేలాది మందికి పీఆర్కే, పీవీఆర్‌ల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారిద్దరూ ఆయా మసీదులకు చేరుకొని దువా కార్యక్రమాన్ని నిర్వహించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ముస్లిం పెద్దలకు దగ్గరుండి వడ్డించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి నుంచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ముస్లింల హక్కుల పరిరక్షణకు పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు వైఎస్సార్, జగన్‌లు ముస్లింల హక్కుల పరిరక్షణకు అనేక చర్యలు తీసుకున్నారు. రాబోయే రోజుల్లోనూ ముస్లింలకు మేలు జరగాలంటే వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు పలకాలన్నారు. ముస్లింలకు మొదటి నుంచి మద్దతు పలుకుతున్న కుటుంబం వైఎస్ కుటుంబమేనన్నారు. అనంతరం ముస్లింలకు జరుగుతున్న మేలు గురించి వివరించారు. ఆయా మసీదులలో దువా నిర్వహించి, ఇఫ్తార్ విందులను ప్రారంభించి, ముస్లిం పెద్దలను పేరు పేరున పలకరించారు. కార్యక్రమంలో సుమారు 3వేల మంది పాల్గొన్నారు. 13 మసీదుల పెద్దలు, మైనార్టీ పెద్దలు, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు అబ్దుల్ జలీల్, తురక కిషోర్, ఆయా వార్డు మైనార్టీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్, షేక్ కరిముల్లా, నాగుల్ మీరా, దస్తగిరి, సుభాని, మదార్‌సాహెబ్‌తో పాటు బ్యూటీషియన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని, మైనార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు


నిందితుడు బండారు చంద్రమోహన్‌రావు

కడపఅర్బన్‌: కడప రిమ్స్ పీఎస్ పరిధిలో 13 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నేరం నిర్ధారణ కావడంతో నిందితుడు బండారు చంద్రమోహన్‌రావు (38)కి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి జడ్జి, ఫస్ట్ ఏడీజే కోర్టు జడ్జి సీ.ఎస్.మూర్తి గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మూడు నెలల శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసు వివరాలిలా వున్నాయి. ప్రకాశం జిల్లా వేటపాలెంకు చెందిన బండారు చంద్రమోహన్‌రావు రిమ్స్ పీఎస్ పరిధిలో తైక్వాండో కోచ్‌గా ఓ స్కూల్‌లో పనిచేసేవాడు. 2019 మార్చి 21న స్కూల్‌కు చెందిన మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి రిమ్స్ పి.ఎస్. ఎస్ఐ ఏ.విద్యాసాగర్ 354 ఐపీసీ సెక్షన్ 12 ఆఫ్ పోక్సోయాక్ట్ -2012 మేరకు క్రైం నెం.17/2019గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను విచారించిన తరువాత గురువారం నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రామసుబ్బారెడ్డి వాదించారు. సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసిన ప్రస్తుత రిమ్స్ పిఎస్ సీఐ కె.రామచంద్ర, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు, అప్పటి రిమ్స్ ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

ప్రతి గడపలోనూ విశేష ప్రజాదరణ

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

దమ్మాలపాడు (ముప్పాళ్ల): ప్రతి గడపలోనూ విశేష ప్రజాదరణ లభిస్తుందని, అందుకు నిదర్శనం నాలుగేళ్ల కాలంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు, పారదర్శక పాలన అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు పాల్గొని వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా నిండైన మనసుతో మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారన్నారు. నాలుగేళ్ల కాలంలో మీకు జరిగిన మేలును వివరించమంటే మళ్లీ నువ్వే రావాలి అంటూ జగన్‌మోహన్‌రెడ్డికి దీవెనలు అందిస్తున్నారన్నారు. పారదర్శక పాలన అమలుతో ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వారి ఇళ్లకు వెళ్లి వారి నుంచి నాలుగేళ్ళ కాలంలో అందిన సంక్షేమ పథకాల అమలుపై అభిప్రాయాలను సేకరించి నమోదు చేశారు. వారి అనుమతితో సెల్‌ఫోన్‌కు, ఇంటికి, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ ను అతికించారు. ముందుగా మంత్రి అంబటిరాంబాబుకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు అపూర్వ స్వాగతం పలికారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, ఎంపీటీసీ కళ్లం సుజాత, ఏఎమ్‌సీ వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బద్దిగం జగన్నాథరెడ్డి, ఎమ్‌జెఎమ్ రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, నక్కా శ్రీనివాసరావు, బీసీ సెల్ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పలు వార్డులకు చెందిన 70 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. ఏబీఎం కాంపౌండ్, డ్రైవర్స్ కాలనీ, అరుంధతి కాలనీ, వినుకొండ రూరల్ మండలం బ్రాహ్మణపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీలో చేరిన వా రికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గంలో రూ.1480 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పార్టీ పదవులు ఇచ్చిన ఘనత తమదే అన్నారు. పార్టీలో చేరిన వారిని కుటుంబసభ్యులుగా భావించి అన్నివిధాలుగాఅండగా ఉంటామని హామీ ఇచ్చారు.


మాజీ ఎమ్మెల్యే జీవీ హయాంలోనే దురాక్రమణలు

జీవీ ఆంజనేయులు ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో వినుకొండలో క్రైస్తవ ఆస్తులు, వక్ఫ్ బోర్డు భూములు ఆక్రమణకు గురయ్యాయని ఎమ్మెల్యే బొల్లా విమర్శించారు. కోట్ల రూపాయల ఆస్తులు దోచుకోవడమే కాకుండా బల్లలు విరగ్గొట్టారని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సత్కరించారు. పార్టీలో చేరిన వారిలో కొత్త రవికిరణ్, కోట శివకుమార్, మన్నేపల్లి సామ్యేలు, గద్దల ఆశీవర ప్రసాద్, పందుల న్యూటన్ ప్రసంగి, బందెల క్రాంతి ఉన్నారు.

మాతృమరణాలపై సమీక్ష

గుంటూరుమెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అధ్యక్షతన మాతృమరణాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. గత నెలలో జిల్లాలో జరిగిన ఒక మాతృ మరణంపై సమీక్షలో చర్చించారు. గర్భం దాల్చింది మొదలు, కాన్పు వరకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు సుఖప్రసవం అయ్యేలా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించేలా అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి సమీపంలోని పెద్దాసుపత్రికి తీసుకెళ్లడం ద్వారా మాతృ మరణాలు సంభవించకుండా నివారించవచ్చని కమిటి వైద్యులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల ఆరోగ్య కేంద్రాల నుంచి, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి హై రిస్క్ కేసులను జీజీహెచ్‌కు పంపించినప్పుడు తక్షణమే సదరు సమాచారం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ముందస్తుగా తెలియజేయడం ద్వారా వారు తగు ఏర్పాట్లు చేసుకుని నాణ్యమైన వైద్య సేవల నుంచి మాతృమరణాలు జరగకుండా చూసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, డీఐఓ డాక్టర్ ఎ.వి.సుబ్బారాజు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ సుస్మిత, డాక్టర్ ఝాన్సీ, మాతృమరణం సంభవించిన ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పది జవాబు పత్రాలు దిద్దుతూ ఉపాధ్యాయుడు మృతి



ఇంకొల్లు (చినగంజాం)/ బాపట్ల అర్బన్‌: ఇంకొల్లు మండలంలోని పూసపాడు గ్రామానికి చెందిన బోడావుల శ్రీనివాసరావు (47) గురువారం బాపట్లలో పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలు దిద్దుతూ రక్తపోటు అధికమై మృతి చెందాడు. పరీక్ష పేపర్లు దిద్దుతున్న సమయంలో ఒక్కసారిగా పడిపోవడంతో తోటి సిబ్బంది అతనిని ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందారు. పర్చూరు గ్రామంలోని వైఆర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు


శివారెడ్డి(జానీ) (ఫైల్ ఫోటో).

కర్లపాలెం: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతిచెంది పడి ఉన్న సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పాతనందాయపాలెంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపిన వివరాల మేరకు పాతనందాయపాలెం గ్రామానికి చెందిన రావి శ్రీనివాసరెడ్డి కుమారుడు శివారెడ్డి(జానీ)(31) బుధవారం రాత్రి 11.30 గంటలకు తన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీ సమీపంలో శవమై పడి ఉన్నాడు. శివారెడ్డి తలకు బలమైన గాయం ఉండటంతో అతని మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని శివారెడ్డి భార్య మౌనిక సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు పోలీసులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శివారెడ్డి మృతితో పాతనందాయపాలెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మరణ వాంగ్మూలం ఇచ్చినా ఎందుకు అరెస్టు చేయలేదు

- ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి
- ప్రత్తిపాడు సర్కిల్ సీఐ సుబ్బారావు తీరుపై ఆగ్రహం
- మృతదేహంతో రోడ్డుపై బంధువుల రాస్తారోకో


సామ్రాజ్యం మృతదేహంతో గుంటూరు-పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

ప్రత్తిపాడు: ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మరణ వాంగ్మూలం ఇచ్చి దాదాపుగా నెల రోజులు గడుస్తున్నా.. నేటి వరకు నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోవడాన్ని నిరసిసూ పాతమద్రాసు రోడ్డుపై మృతురాలి బంధువులు రాస్తారోకో చేసిన ఘటన నియోజకవర్గ కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెం గ్రామానికి చెందిన వణుకూరి సామ్రాజ్యంకు రామకృష్ణారెడ్డితో వివాహం అయ్యింది. సామ్రాజ్యానికి మామ ఫణిరెడ్డితోపాటు భర్త కుటుంబ సభ్యులతో తరచూ గొడవలవుతున్నాయి. గొడవల సమయంలో భర్త రామకృష్ణారెడ్డి ఏమీ మాట్లాడకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె గత నెల 11వ తేదీన పెట్రోల్ పోసుకుని నిప్పంటిచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 19వ తేదీ రాత్రి సామ్రాజ్యం మృతిచెందింది.

ప్రత్తిపాడు సీఐ తీరును నిరసిస్తూ..

ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబ సభ్యులు బుధవారం ప్రత్తిపాడు సీఐ సుబ్బారావును కలిసి నిందితులను అరెస్టు చేయాలని కోరారు. ఆయన నుంచి సరైన స్పందన లేకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బాధితులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో గురువారం పోస్టుమార్టం పూర్తవ్వగానే కుటుంబ సభ్యులు నేరుగా సామ్రాజ్యం మృతదేహంతో ప్రత్తిపాడుకు చేరుకుని స్థానిక ఇందిరాగాంధీబొమ్మ సెంటరులో రాస్తారోకో చేశారు. సీఐ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐలు డి రవీంద్రబాబు, అబ్దుల్ రెహమాన్‌లు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా వారు శాంతించకపోవడంతో గుంటూరు అర్బన్ సౌత్‌జోన్ డీఎస్పీ జె ప్రశాంతి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. నిన్నటి నుంచి సీఐ చుట్టూ తిరుగుతున్నా కనీసం సరిగా సమాధానం కూడా చెప్పలేదని బాధితులు డీఎస్పీకి చెప్పారు. సానుకూలంగా స్పందించిన డీఎస్పీ 24 గంటల్లో కచ్చితంగా నిందితులను అదుపులోనికి తీసుకుంటామని, సీఐపై ఫిర్యాదు చేస్తే ఆయనపై కూడా విచారణ చేస్తానని స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారు శాంతించి, రాస్తారోకోను విరమించారు.